ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

Bullet Edition

గురువారం, 25 జూలై 2024 www.prajaaswaramdaily.com 2PM



## లారీని ఢీకొట్టిన బైక్.. ముగ్గురు యువకుల దుర్మరణం

హైదరాబాద్, జూలై 25 (ప్రజాస్వరం) : సంగారెడ్డి జిల్లాలో రోడ్డుప్రమాదం జరిగింది. కంది మండలం తునికిళ్ల తండా శివారులో జరిగిన ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం పాలయ్యారు. నాందేడ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీని వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు అక్కడికక్కడే చనిపోయారు. మృతులను పుల్కల్ మండలం గంగోజీపేటకు చెందిన సందీప్, నవీన్, అభిషేక్‌గా గుర్తించారు. ఈ ముగ్గురూ అక్షయపాత్రలో డెలివరీ బాయ్స్‌గా పనిచేసేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

## అదుపుతప్పి పశువుల కొట్టంలోకి దూసుకెళ్లిన బస్సు

హైదరాబాద్, జూలై 25 (ప్రజాస్వరం) : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలో కరంజీ (టి) నుంచి ఆదిలాబాద్ వైపు వస్తున్న బస్సు ఆర్లీ(టి) గ్రామంలోకి రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న బక్కి అనిల్ అనే రైతు కొట్టంలోకి దూసుకెళ్లింది. కొట్టం పూర్తిగా ధ్వంసమైంది. కట్టేసి ఉన్న ఎద్దును ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. ఆ సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉండగా.. ఎవరికి ఏమీ కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## ఇల్లెందు ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

హైదరాబాద్, జూలై 25 (ప్రజాస్వరం) : రోగులను చూడటానికే డాక్టర్లకు జీతాలు ఇస్తున్నారని, రోగులను పట్టించుకోకుండా, ఫోన్లో టైంపాస్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందికి కలెక్టర్ వార్నింగ్ ఇచ్చారు. ఇల్లెందులోని ప్రభుత్వ ఆస్పత్రిని కొత్తగూడెం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. డాక్టర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.





# రూ.2,91,159 కోట్లు

## తెలంగాణ అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన భట్టి విక్రమార్క

హైదరాబాద్, జూలై 25 (ప్రజాస్వరం) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో పూర్తిస్థాయి పద్దును ప్రవేశపెట్టారు. రూ.2,91,159కోట్లతో బడ్జెట్‌ను సభ ముందుకు తీసుకొస్తున్నట్లు మంత్రి తెలిపారు. దీనిలో మూలధన వ్యయం రూ.33,487 కోట్లుగా చెప్పారు. పన్ను ఆదాయం 1,38,181.26 కోట్లు, పన్నేతర ఆదాయం రూ.35,208.44 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా 26.216.28 కోట్లు, కేంద్రం గ్రాంట్లు 21,636.15 కోట్లుగా పేర్కొన్నారు. ఈ ఏడాది రూ.57,112 కోట్ల అప్పులు తీసుకోవాలని ప్రతిపాదించారు. నిజాం షుగర్స్‌ను తిరిగి ప్రారంభిస్తామని భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు.

## రాష్ట్ర బడ్జెట్ స్వరూపమిదీ..

ఆర్థిక లోటు అంచనా రూ.49,255.41 కోట్లు
ప్రాథమిక లోటు అంచనా రూ.31,525.63 కోట్లు
రెవెన్యూ మిగులు అంచనా రూ.297.42 కోట్లు
వ్యవసాయానికి రూ.72,659 కోట్లు
ఉద్యానశాఖకు రూ.737కోట్లు
పశుసంవర్ధశాఖకు రూ.1,980కోట్లు
రూ.500 గ్యాస్ సిలిండర్ పథకానికి రూ. 723కోట్లు
గృహజ్యోతికి రూ.2,418కోట్లు
ప్రజాపంపిణీ వ్యవస్థకు రూ.3836కోట్లు
పంచాయతీ రాజ్,
గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.29,816 కోట్లు
రీజినల్ రింగ్ రోడ్డు
(ఆర్ఆర్ఆర్)కు రూ.1,525 కోట్లు
స్త్రీ, శిశు సంక్షేమానికి రూ. 2,736 కోట్లు
ఎస్సీ సంక్షేమం రూ.33,124కోట్లు
ఎస్టీ సంక్షేమం రూ.17,056కోట్లు
మైనార్టీ సంక్షేమం రూ.3,003కోట్లు
బీసీ సంక్షేమం రూ.9,200 కోట్లు
వైద్య, ఆరోగ్యం రూ. 11,468 కోట్లు
ట్రాన్స్‌కో, డిస్కంలకు రూ.16,410 కోట్లు
అడవులు, పర్యావరణం రూ.1,064 కోట్లు
పరిశ్రమల శాఖకు రూ. 2,762 కోట్లు
ఐటీ శాఖకు రూ.774 కోట్లు
నీటిపారుదల రంగానికి రూ.22,301 కోట్లు
విద్యకు రూ.21,292 కోట్లు
హోంశాఖకు రూ.9,564కోట్లు
రోడ్లు, భవనాల శాఖకు రూ.5,790 కోట్లు



## బడ్జెట్... ఆరు గ్యారెంటీలకు హామీపత్రం

**బడ్జెట్ పై సీఎం రేవంత్‌రెడ్డి స్పెషల్ ట్వీట్!**

ఆరు గ్యారెంటీలకు హామీ పత్రం ఈ బడ్జెట్ అని, ఆర్భాటపు అంకెలు కాకుండా వాస్తవపు లెక్కల బడ్జెట్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇవ్వాళ తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి 2024-25 వార్షిక బడ్జెట్ ను డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖమంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దీనిపై రేవంత్ రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా.. ఈ బడ్జెట్ ప్రజల ఆకాంక్షలు, రాష్ట్రాభివృద్ధి, పేదల సంక్షేమాన్ని సమన్వయం చేసుకుని రూపొందించారని సీఎం ప్రశంసించారు. అలాగే ఆరు గ్యారెంటీలకు హామీ పత్రం ఈ బడ్జెట్ అని స్పష్టం చేశారు. అంతేగాక ఆర్భాటపు అంకెలు కాదు, వాస్తవపు లెక్కల బడ్జెట్ ఇది అని తెలిపారు. ఇక కేంద్రం వివక్ష.. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసాల మధ్య తెలంగాణ ఆకాంక్షలు నెరవేర్చేలా ఈ బడ్జెట్ ను రూపొందించిన డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖమాత్యులు మల్లు భట్టి విక్రమార్క గారికి, వారి బృందానికి నా అభినందనలు అంటూ రేవంత్ రెడ్డి ఎక్స్ లో రాసుకొచ్చారు.

## బడ్జెట్‌పై కేసీఆర్ కామెంట్స్.. బట్టి కౌంటర్..

2024-25 బడ్జెట్ పై తెలంగాణ మాజీ సీఎం, అసెంబ్లీ ప్రతిపక్ష నేత కేసీఆర్ స్పందించారు. అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెల గారడీలా ఉందని.. బడ్జెట్ ఒ పస లేదు పాడు లేదని.. రైతు బందుకు ఎటువంటి కేటాయింపులు చేయలేదని విమర్శించారు. కేసీఆర్ వ్యాఖ్యలపై ట్విట్టర్ వేదికగా స్పందించిన భట్టి.. ఇలా రాసుకొచ్చారు. ఆర్భాటపు అంకెల గారెడీతో ప్రజలను మోసం చేశారు. మీరు చేసిన 6 లక్షల 71వేల 757 కోట్ల అప్పులకు, రుణాలు చెల్లిస్తూ రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రజాభీష్టం మేరకు తయారు చేసిన వాస్తవ లెక్కలు బడ్జెట్ మాది అంటూ కేసీఆర్ కు భట్టి కౌంటర్ ఇచ్చారు.

## పోలీసు శాఖకు రూ.9,564 కోట్లు

బడ్జెట్‌లో హోంశాఖకు ప్రభుత్వం రూ.9,564 కోట్లు కేటాయించింది. రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్ మాఫియాను అంతం చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఈ మేరకు యువతను నిర్వీర్యం చేస్తున్న మాదకద్రవ్యాల కట్టడి, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాముఖ్యతను ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. డ్రగ్స్ అమ్ముతూ రెడ్ హ్యాండెడ్ గా ఎవరు పట్టుబడినా.. తీసుకున్నా వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలంటూ ఇప్పటికే క్లియర్ గా పోలీసు శాఖకు ఆదేశాలు ఇచ్చామని సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారని పేర్కొన్నారు. విద్యా సంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి.. 4,137 మంది విద్యార్థులను యాంటీ డ్రగ్ సోల్జర్స్ గా నియమించామని తెలిపారు.

## నగరానికి పెద్దపీట

**రూ. 22,800 కోట్ల కేటాయింపులు**




హైదరాబాద్, జూలై 25 (ప్రజాస్వరం) : రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో హైదరాబాద్ మహానగరానికి భారీగా కేటాయింపులు చేసింది. విభాగాలన్నింటికీ కలిపి సర్కారు ఏకంగా రూ. 22,800 కోట్లను కేటాయించటం పట్ల వివిధ శాఖలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న జీహెచ్ఎంసీకి రూ.3,065 కోట్ల కేటాయింపులు జరపటంతో బల్దియాకు కాస్త ఊరట కలిగింది. హైదరాబాద్ మహానగరంలో ప్రత్యేకంగా మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ఏకంగా రూ. 10 వేల కోట్లను కూడా కేటాయించటం జీహెచ్ఎంసీ చరిత్రలోనే ఫస్ట్ టైమ్‌గా చెప్పుకోవచ్చు. ఇటీవలే ఏర్పాటైన హైడ్రాకు కూడా రూ. 100 కోట్ల నిధులు కేటాయించింది. జీహెచ్ఎంసీ పరిధిలో మౌలిక వసతులకు ప్రత్యేకంగా రూ.3,050 కోట్లు, అదనంగా సిటీ అభివృద్ధికి రూ.10 వేల కోట్లు, జలమండలికి రూ.3,385 కోట్లు, హెచ్ఎండీఏకు రూ.500 కోట్లు, మెట్రో రైలు విస్తరణ (పాతబస్తీ)కి రూ.500 కోట్లు, ఏయిర్ పోర్టు మెట్రోరైలుకు రూ. 500 కోట్లు, జీహెచ్ఎంసీ పరిధితో పాటు ఔటర్ వెలుపలనున్న ప్రాంతాల్లో డిజాస్టర్ మేనేజ్ మెంట్, ఆస్తుల పరిరక్షణ కోసం ఇటీవలే ఏర్పాటు చేసిన హైదాకు రూ. 200 కోట్లు కేటాయించింది. మూసీ ప్రక్షాళన, సుందరీకరణకు రూ. 1500 కోట్లు కేటాయించింది.